## అధిక ఎండలు, చలికి 35 వేల మంది మృతి

న్యూఢిల్లీ: అమృత్ తెలంగాణ:భారత్‌లో 2001-2019 మధ్య కాలంలో అధిక ఎండలు, చలి కారణంగా కనీసం 35 వేల మంది ప్రాణాలు కోల్పోయారని తాజా అధ్యయనం వెల్లడించింది. టెంపరేచర్ జర్నల్‌లో ఈ అధ్యయనం ప్రచురితమైంది. ఒక్క 2015లోనే వడదెబ్బ కారణంగా 1,907 మంది, తీవ్రమైన చలి వల్ల 1,417 మంది ప్రాణాలు కోల్పోయారని అధ్యయనం తెలిపింది. అయితే తీవ్ర ఉష్ణోగ్రతల వల్ల కలిగే మరణాలను, అనారోగ్య ప్రభావాలను నివారించొచ్చని.. అందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అధ్యయన ప్రధాన రచయిత ప్రదీప్ గుయిన్ తెలిపారు. పనిచేసే వయసులో ఉన్నవారే వడదెబ్బ వల్ల ఎక్కువగా చనిపోతున్నారని చెప్పారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా మహిళలతో పోలిస్తే పురుషుల్లో మరణాలు 3-5 రెట్లు, తీవ్రమైన చలి వల్ల సంభవించిన మరణాలు 4-7 రెట్లు పెరిగాయని పరిశోధకులు తెలిపారు.


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

## బీసీ గురుకులాల్లో ఇంటర్ అడ్మిషన్లు

హైదరాబాద్, మే2 అమృత్ తెలంగాణ: బీసీ గురుకుల సొసైటీ పరిధిలోని జూనియర్ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ మేరకు మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో https:// mjptbcwreis.telangana.gov.in, https://mjpabcwreis.cgg. gov. in/TSMJBCWEB/ లో 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీతోపాటు రెగ్యులర్ గ్రూప్‌లతో పాటు అగ్రికల్చర్, క్రాప్ ప్రొడక్షన్, కంప్యూటర్ గ్రాఫిక్స్, యానిమేషన్, ప్రీ సూల్ టీచర్ ట్రైనింగ్, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేరొన్నారు.


సంపుటి: 01 సంచిక : 206. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శనివారం.03.05.2025పేజీలు:4, వెల:రూ.1.00


# మే 5 నుంచి 28 జిల్లాలలోని ఒక్కో మండలంలో రెవెన్యూ సదస్సులు

### 20 వ తేదీలోపు సదస్సులు పూర్తయ్యేలా ప్రణాళిక

### ఇందిరమ్మ ఇండ్లు 600 చదరపు అడుగులకు మించొద్దు

### రెవెన్యు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి సమగ్ర అధ్యయనం జరిపిన మీదట రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావుతో కలిసి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఏప్రిల్ 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు 28 జిల్లాల్లోని 28 మండలాల్లో పైలట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్ల నేతృత్వంలో ప్రతి మండలానికి రెండు బృందాలను నియమించాలని, ప్రతీ బృందంలో తహసీల్దార్, సర్వేయర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ తప్పనిసరిగా ఉండేలా చూడాలని, ఉదయం నుండి సాయంత్రం వరకు ఈ బృందాలు నిర్దేశిత గ్రామంలోనే ఉంటూ భూ సమస్యలపై ప్రజలు, రైతుల నుండి అర్జీలు స్వీకరించాలన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ వరకు పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్కరించడం లేదనే విషయాన్నిలిఖిత పూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తును తిరస్కరించాలని తెలిపారు. ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, అసైన్డ్ ల్యాండ్‌లకు సంబంధించి పొజిషన్ మీద ఉండి పట్టా లేనివారు, పట్టా ఉండి పొజిషన్ మీద లేనివారి వివరాలను సేకరించాలని సూచించారు. కబ్జాలకు, అన్యాక్రాంతానికి గురైన ప్రభుత్వ భూములను సైతం గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకుని పక్కాగా వాటి వివరాలను రికార్డులలో పొందుపర్చాలని ఆదేశించారు. భూభారతి నూతన చట్టంపై రాష్ట్రంలో 605 మండలాలకు గాను ఇప్పటివరకు 590 మండలాల్లో అవగాహన సదస్సులను నిర్వహించడం జరిగిందని, 85,527 మంది పౌరులు, 1,62,577 మంది రైతులు అవగాహన సదస్సులలో పాల్గొన్నారని మంత్రి వివరించారు. ఇదిలాఉండగా, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఒక్కో నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇండ్లకు గాను లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసిన వెంటనే ఏరోజుకు ఆ రోజు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు జాబితాను పంపి వారి ఆమోదం తీసుకోవాలని, ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో కనీసం 500 ఇండ్లను కేటాయించి లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో అత్యంత పేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేశారు. అనర్హులని తేలితే ఇండ్ల నిర్మాణం మధ్యలో ఉన్నాకూడా రద్దు చేస్తామన్నారు. లబ్ధిదారుల చెక్ లిస్ట్ ను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ లు తమ అధీనంలో జాగ్రత్తగా భద్రపర్చాలని అన్నారు. లబ్ధిదారులు ఇంటిని 400 చదరపు అడుగులకు తగ్గకుండా, 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం చేపట్టేలా చూడాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యవేక్షణ జరుపుతూ, మంజూరీ తెలుపబడిన ప్రతి లబ్ధిదారుడు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి నిర్ణీత గడువులోపు పూర్తి చేసుకునేలా అధికారులు క్షేత్రస్థాయి పర్యవేక్షణ జరపాలన్నారు. అదే సమయంలో నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో ఇంటి నిర్మాణ పనులు జరిగేలా పర్యవేక్షణ చేయాలని, ఈ మేరకు ఏ.ఈ స్థాయి అధికారులను ప్రతి మండలానికి ఒకరు చొప్పున కేటాయిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇంటి నిర్మాణ దశలను బట్టి తక్షణమే లబ్ధిదారుల ఖాతాలలోకి ఇందిరమ్మ ఇళ్ల పథకం డబ్బులను జమ చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లోజిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బు గుప్తా, ట్రైనీ కలెక్టర్ సలోని, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు వైటీపీఎస్‌కు ఇంజినీర్ల కేటాయింపు



హైదరాబాద్, మే 2 అమృత్ తెలంగాణ: యాదాద్రి పవర్ ప్లాంట్‌లో ఇంజినీర్ల కొరత సమస్య, పర్యవేక్షణ లోపం నేపథ్యంలో టీజీ జెన్‌కో దిద్దుబాటు చర్యలు చేపట్టింది. వైటీపీఎస్‌కు ఎట్టకేలకు 81 మంది అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ల (ఏడీఈ)లను కేటాయించింది. పదోన్నతి పొందిన వారికి వైటీపీఎస్‌లో పోస్టింగ్స్ ఇచ్చింది. వైటీపీఎస్‌లో ఒక యూనిట్‌లో విద్యుత్తు ఉత్పత్తి జరుగుతున్నది. మరో యూనిట్‌లో ట్రయర్ రన్ నడుస్తున్నది. ఇటీవలే యూనిట్-1లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్లాంట్ ఓఅండ్ఎంను ఓ ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈ), అడిషనల్ అసిస్టెంట్ ఇంజినీర్ల (ఈఈఏ)కు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లుగా పదోన్నతులు కేటాయించినా పోస్టింగ్స్ ఇవ్వడంలేదన్న ఆరోపణలొచ్చాయి దీంతో స్పందించిన యాజమాన్యం 81 మంది ఇంజినీర్లను కేటాయించింది. అలాగే, భద్రాద్రి ప్లాంట్‌కు 41మంది, కేటీపీపీకి 43 మంది, కేటీపీఎస్‌కు 24 మందికి పోస్టింగ్స్ ఇచ్చింది.

బదిలీ చేశారు.. రివర్షన్ ఇచ్చారు

జెన్‌కో ఉద్యోగులు కొందరిని బదిలీ చేసి నిలుపుదల చేయడం వివాదాస్పదమవుతున్నది. ఇటీవల రామగుండంలోని ఆర్టీఎస్‌లో పనిచేస్తున్న 72 మంది ఓఅండ్ఎం స్టాఫ్, 11 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు, ఒక అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌ను వైటీపీఎస్, బీటీపీఎస్‌కు బదిలీచేశారు. తాజాగా 11 మంది ఓఅండ్ఎం స్టాఫ్ బదిలీని నిలుపుదల చేశారు. మరికొందరు రిలీవ్ కాలేదని తెలిసింది. యాదాద్రిలో ఉద్యోగుల కొరత సమస్య ఉండగా, ఆర్టీఎస్ ప్లాంట్ మూతపడ్డా మిగులు ఉద్యోగులున్నారు. వీరికి ప్రతి నెలా కూర్చోబెట్టి జీతాలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

# మావోయిస్టులతో చర్చలు జరపాలి వామపక్షాల సదస్సులో వక్తలు



హైదరాబాద్, మే 2 అమృత్ తెలంగాణ: మావోయిస్టులతో కేంద్రప్రభుత్వం బేషరతుగా శాంతి చర్చలు జరపాలని, ఆదివాసీలను హననం చేసే ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని వామపక్షాల సదస్సులో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో హైదరాబాద్ దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం రాష్ట్ర సదస్సు జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జస్టిస్ బీ చంద్రకుమార్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, సీపీఐఎంఎల్ మాస్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేజీ రాంచందర్, ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి ఏ జానకీరాములు, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రాజారమేశ్, నేతలు సీహెచ్ మురహరి, ప్రసాద్, విశ్వనాథ్, విమలక ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తేదీ,సమయంనిర్దేశించి మరీ మావోయిస్టులను సంహరిస్తామని ప్రకటించే హకు కేంద్ర హెూంమంత్రి అమిత్ షాకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. గతంలో మాజీ ప్రధానిరాజీవ్‌గాంధీని అత్యంత దారుణంగా చంపినవారికే క్షమాభిక్ష పెట్టాలని ఆయన కుమారుడు రాహుల్‌గాంధీ, కుమార్తె ప్రియాంకాగాంధీ కోరారని గుర్తుచేశారు. కానీ, కేంద్రప్రభుత్వం మాత్రం అత్యంత దుర్మార్గంగా మావోయిస్టులను చంపుతున్నదని ఆరోపించారు. ఈ దేశ పౌరులపైనే యుద్ధం ప్రకటించడం ఏమిటని నిలదీశారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ ఘటనలను న్యాయస్థానాలు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని కోరారు.

# కృష్ణా జలాల్లో వాటా కోసం పోరాడాలి

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్, మే 2 అమృత్ తెలంగాణ: కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పోరాడాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 90శాతం పూర్తయ్యాయని మెచ్చుకున్న నీటిపారుదల శాఖ మంత్రికి.. మిగిలిన 10శాతం పనుల పూర్తికి మరో రెండేండ్ల సమయం ఎందుకు పడుతుందని నిలదీశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టులపై కేవలం సమీక్షలు చేస్తే సరిపోదని దుయ్యబట్టారు. సాగదీత కోసమే నీటిపారుదల శాఖ మంత్రి పాలమూరులో పర్యటిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో పాలమూరు ఎత్తిపోతల పథకంలో తట్టెడు మట్టి తీసిన పాపాన పోలేదని మండిపడ్డారు. పాలమూరు బిడ్డగా చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ ప్రాంత ప్రాజెక్టుల పనులు చేపట్టకపోవడం సొంతగడ్డకు ద్రోహం చేసినట్టు కాదా? అని సూటిగా ప్రశ్నించారు. ప్యాకేజీ-3లో 8 కిలోమీటర్ల కాలువ మాత్రమే మిగిలిపోయిందని, అది కూడా ఆలస్యమవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. దాని కాంట్రాక్టు ఆంధ్రా పార్టీకి చెందిన వారికి దక్కిందని, బహుశా ఆంధ్రా పాలకుల ఒత్తిడితో ఆలస్యమవుతుందేమోనని అనుమానం వ్యక్తంచేశారు. డిండికి గ్రావిటీ ద్వారా నీరు వస్తుందని, అది కూడా రూ. 80 కోట్ల నుంచి రూ. 100 కోట్ల మేరకే ఖర్చవుతుందని తాము చెప్తుంటే, దానిని కాంగ్రెస్ సర్కారు పెడచెవిన పెడుతుందని ధ్వజమెత్తారు. పాలమూరు పనులను పక్కనబెట్టి, డిండి పనులను ఎందుకు హడావుడిగా చేపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు.

నీళ్లు లేక ఎండుతున్న పంటలు..

సాగునీళ్లు ఇవ్వకపోవడంతో పంటలు ఎండుతున్నాయని నిరంజన్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతుభరోసా ఇవ్వకుండా వారిని వేధిస్తున్నారని, రుణమాఫీ సగం మందికి కూడా కాలేదన్న విషయాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్న విషయాన్ని సర్కారు గమనంలోకి తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ సర్కారు రైతులకు ఇచ్చిన బోనస్ ఎంత? కొన్న ధాన్యం ఎంతో లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ, హైడ్రాతో రాబడులను ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

బ్రిజేశ్ తీర్పుతో తెలంగాణకు నీళ్లు గగనమే..

బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను ఈ నెల 7న ఫైనల్ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సమావేశం కానున్నదని, అయితే ఈ ఉత్తర్వులపై బీఆర్ఎస్ తరఫున అభ్యంతరాలు వ్యక్తంచేశామని నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ తీర్పును తెలంగాణ ఒప్పుకుంటే ఆల్మట్టిలో 160 టీఎంసీల నీటిని నిలుపుకొనేందుకు అవకాశం ఉంటుందని, దీంతో తెలంగాణకు నీళ్లు రావడం గగనమే అని, ఫలితంగా జూరాల ప్రాజెక్టు వట్టిపోవడం ఖాయమన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం పట్టుబట్టాలని ఆయన సర్కారుకు సూచించారు.

# దోస్త్ నోటిఫికేషన్ విడుదల.. మూడు విడుతల్లో అడ్మిషన్లు




హైదరాబాద్, మే 2 అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాలు కల్పించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) 2025 నోటిఫికేషన్ విడుదలైంది. శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి చైర్మన్, దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశ్ దోస్త్ నోటిఫికేషన్‌ను విడుదలచేశారు. మొత్తం మూడు విడుతల్లో సీట్లను భర్తీచేయనుండగా, శనివారం నుంచే మొదటి విడుత రిజిస్ట్రేషన్లు ప్రారంభంకానున్నాయి. రాష్ట్రంలోని 8 విశ్వవిద్యాలయాల పరిధిలో గల ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో దోస్త్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ కాలేజీల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు దోస్త్ వెబ్‌సైట్‌ను సంప్రదించి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. మూడు విడుతల వెబ్ కౌన్సెలింగ్ జూన్ 28న ముగియనున్నది. మూడు విడుతల్లో సీట్లు పొంది ఆన్‌లైన్‌లో సెల్ఫ్‌రిపోర్టింగ్ చేసిన విద్యార్థులు జూన్ 24 నుంచి 28 వరకు సీట్లు పొందిన కాలేజీల్లో నేరుగా రిపోర్టుచేయాల్సి ఉంటుంది. జూన్ 24 నుంచి 28 వరకు కాలేజీల్లో విద్యార్థులకు ఓరియంటేషన్ నిర్వహిస్తారు. జూన్ 30 నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ క్లాసులు ప్రారంభం కానున్నాయి.

ఇక మొత్తం సీట్లు మనోళ్లకే..

రాష్ట్రంలో 1,057 డిగ్రీ కాలేజీలు ఉండగా, మొత్తం 4,57,724 సీట్లు ఉన్నాయి. వీటిలో 70 కాలేజీలు నాన్ దోస్త్ కాలేజీలు ఉండగా, 40,603 సీట్లు ఉన్నాయి. ఈ సీట్లను దోస్త్ ద్వారా కాకుండా ఆయా కాలేజీలే సొంతంగా భర్తీ చేసుకుంటున్నాయి. అయితే, ఈ విద్యాసంవత్సరం నుంచి మొత్తం సీట్లు తెలంగాణ విద్యార్థులకే దక్కనున్నాయి. డిగ్రీలో ఇంతకాలం అమలైన 15 శాతం ఏపీ కోటా ఇకనుంచి ఉండదు. రాష్ట్ర విభజన జరిగి 10 ఏండ్లు పూర్తవడంతో ఏపీ కోటాను తొలగించారు. మొత్తం 95 శాతం సీట్లను తెలంగాణ స్థానికులతో, మరో 5 శాతం సీట్లను రాష్ట్రంలో స్థిరపడ్డ ఇతర రాష్ట్రాల వారి పిల్లలు, మన రాష్ట్రం వారిని వివాహం చేసుకున్న వారితో భర్తీచేస్తారు. దీంతో మొత్తం సీట్లు మనోళ్లకే దక్కనున్నాయి. ఈసారి దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్‌పాటు ఎస్సీ వర్గీకరణను దోస్త్‌లో అమలుచేయాలని నిర్ణయించారు.

# సర్కారీ అప్పులు తగ్గాలి



న్యూఢిల్లీ, మే 2 :అమృత్ తెలంగాణ: దేశ రుణ భారం చాలా ఎక్కువగా ఉందని, ఇది తగ్గాలని.. అప్పుడే గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు భారత క్రెడిట్ రేటింగ్‌ను పెంచుతాయని ఆర్థిక వ్యవహారాల (డీఈఏ) కార్యదర్శి అజయ్ సేథ్ అన్నారు. ఈ సర్కారీ అప్పులపై చెల్లించే వడ్డీ భారం కూడా మోయలేనివిధంగా తయారవుతున్నదని, దాన్ని దించుకోవాల్సిన అవసరం ఎంతో ఉన్నదనీ ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఐఎస్ఏఈసీ సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ కాన్ఫరెన్స్‌లో అజయ్ మాట్లాడుతూ.. అప్పులు పెరుగుతూపోవడం మంచిదికాదన్నారు. రేటింగ్ అప్‌గ్రేడ్ కోసం రేటింగ్ ఏజెన్సీలతో భారత్ ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తోందని వివరించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడానికి మితిమీరిన రుణ భారమేనంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఖర్చులకు సంబంధించి స్పందిస్తూ.. చాలావరకు సమతూకం లోపించిందన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాభివృద్ధి కంటే రుణ నిధులను వ్యయాలను పెంచుకోవడానికే వినియోగిస్తున్నాయన్నారు. కాగా, ట్యాక్స్-టు-జీడీపీ రేషియో 20 శాతానికి చేరాలంటే 5-6 ఏండ్లు పట్టవచ్చన్నారు.

# బెస్ట్ వుమన్ ఫుట్‌బాలర్ సౌమ్య

భువనేశ్వర్:అమృత్ తెలంగాణ: తెలంగాణ యువ ఫుట్‌బాలర్ గుగులోతు సౌమ్య ప్రతిభకు తగిన గుర్తింపు లభించింది. ఇందూరులో పుట్టి అంచలంచెలుగా ఎదిగిన సౌమ్య..అనతికాలంలోనే దేశం గర్వించదగ్గ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య(ఏఐఎఫ్ఎఫ్) వార్షిక అవార్డుల్లో భాగంగా 'బెస్ట్ వుమన్ ఫుట్‌బాలర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు విజేతగా నిలిచింది. శుక్రవారం భువనేశ్వర్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సౌమ్య.. ఏఐఎఫ్ఎఫ్ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకుంది. తెలంగాణ నుంచి బెస్ట్ వుమన్ ఫుట్‌బాలర్ అవార్డు దక్కించుకున్న తొలి ప్లేయర్‌గా అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. 2021లో జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేసిన ఈ 23 ఏండ్ల నిజామాబాద్ అమ్మాయి ఇప్పటి వరకు 33 మ్యాచ్‌లాడి 5 గోల్స్ చేసింది.

## జిల్లా కలెక్టర్ అదిలాబాదు ఆదేశాముల ప్రకారం ఇచ్చోడ మండలం రైతులకు రబీ సీజన్ లో పండించిన జొన్నపంట దళారులకు అమ్మకుండా ప్రభుత్వం నిర్ణయించిన యం.యస్.పి ధరకు ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్లోనే విక్రయించగలరు.




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : జిల్లా కలెక్టర్ అదిలాబాదు ఆదేశాముల ప్రకారం ఇచ్చోడ మండలం రైతులకు రబీ సీజన్ లో పండించిన జొన్న పంట దళారులకు అమ్మకుండా ప్రభుత్వం నిర్ణయించిన యం.యస్.పి ధరకు ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్లోనే విక్రయించగలరు. రెవెన్యూ, వ్యవసాయ మరియు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా, మాదాపూర్ గ్రామంలోని ఎండీ సజ్జద్ గారి వ్యవసాయ క్షేత్రములోని పశువుల కొట్టములో సుమారు 512 జొన్న సంచులు కనోగొనడము జరిగినది. ఆధారములు లేనందున సీజ్ చేసి వాటిని తదుపరి చర్య తీసుకునే వరకు ఏఇఓ గారికి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు సురక్షితంగా ఉంచుటకు ఇవ్వనైనది. ఎలాంటి ఆధార పత్రాలు లేకుండా ఎవరైనా అక్రమ రవాణా చేసిన అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకొనగలమని జిల్లా కలెక్టర్ గారు ఆదేశించారు ఇట్టి వార్తను అన్ని దినపత్రికలలో ప్రచురించగలరని కోరనైనది

# మే 01 వ తేది నుండి మే 31 వరకు జిల్లా అంతట 30 పోలీస్ యాక్ట్ 1861



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి: నిర్మల్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతత ను పెంపొందించేందుకు 01 మే 2025 నుండి 31 మే 2025 వరకు, జిల్లా అంతటా 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డా.జి..జానకి షర్మిల ఐపిఎస్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీస్ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు,ధర్నాలు జరుపరాదు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్ లను మరియు జనసమూహం ప్రోగు అవుట వంటివి నిషేధం. రాళ్ళను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధం. లౌడ్ స్పీకర్ లు, డీజే లు వంటివి కూడా ఈ సమయంలో నిషేధము.నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీస్ ఆక్ట్ 1861 కింద శిక్షార్హులు అగుదురని ఎస్పి పేర్కొన్నారు

# నీట్ పరీక్ష కు పకడ్బందీ ఏర్పాట్లు





అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి : పరీక్షా కేంద్రాలకు వచ్చే అభ్యర్థులు ఐడి కార్డు, అడ్మిట్ కార్డ్ (హాల్ టికెట్), 2 ఫొటో లు తమ వెంట తీసుకురావాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరగనున్ననీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత ఆయా కేంద్రాల చీఫ్ సుపరెండెంట్ లను ఆదేశించారు . శుక్రవారం జిల్లాలో 7 కేంద్రాలలో నిర్వహిస్తున్న. నీట్ పరీక్ష సందర్భంగా పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎస్పీ తో కలసి పరిశీలించారు ఈ సందర్భంగా ఏడు కేంద్రాలు

1.తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల బాలురు
2.సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాల బాలికలు
3.ప్రభుత్వ బాలికల పాఠశాల భూక్తాపూర్
4.ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆర్ట్స్, కామర్స్
5.బంగారి గూడ తెలంగాణ మోడల్ స్కూల్
6.,7 తెలంగాణ రెసిడెన్షియల్ మైనార్టీ స్కూల్. లో 2 కేంద్రాలలో ఏర్పాటు చేయడం జరిగిందనీ ఆన్నారు.

జిల్లాలో 1659 మంది పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థుల కనుగుణంగా మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు.

అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 వరకు అనుమతించడం జరుగుతుందని, స్ట్రాంగ్ రూమ్ ల నుండి ప్రశ్న పత్రాలు, పరీక్ష సామాగ్రిని పకడ్బందీ పోలీస్ బందోబస్తు మధ్య తరలింపు, పరీక్షా కేంద్రాలలో తాగునీరు, ఏ.ఎన్.ఎం బృందాలను అందుబాటులో ఉండాలని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు

నిషేధించబడిన అంశాలు

అభ్యర్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రం లోపల కింది వస్తువులను తీసుకెళ్లడానికి అనుమతించరు. బ్యాగ్‌లు/బ్యాగేజీ/డబ్బు మొదలైన అభ్యర్థులు తీసుకొచ్చిన ఏదైనా వస్తువును భద్రపరిచే బాధ్యత పరీక్షా కేంద్రం వహించదు:

1. టెక్స్టువల్ మెటీరియల్ (ముద్రించబడిన లేదా వ్రాసినవి), కాగితాల బిట్స్, జ్యామితి/పెన్/పెన్సిల్ బాక్స్, ప్లాస్టిక్ పర్సు, కాలిక్యులేటర్, స్కేల్, రైటింగ్ ప్యాడ్, పెన్ డ్రైవ్‌లు, ఎరేజర్, కాలిక్యులేటర్, లాగ్ టేబుల్, ఎలక్ట్రానిక్ పెన్/స్కానర్ మొదలైన ఏదైనా స్టేషనరీ వస్తువు.
2. మొబైల్ ఫోన్, బ్లూటూత్, ఇయర్‌ఫోన్‌లు, మైక్రోఫోన్, పేజర్, హెల్త్ బ్యాండ్ మొదలైన ఏదైనా కమ్యూనికేషన్ పరికరం.
3. వాలెట్, గాగుల్స్, హ్యాండ్‌బ్యాగ్‌లు, బెల్ట్, క్యాప్ మొదలైన ఇతర వస్తువులు
4. ఏదైనా వాచ్/రిస్ట్ వాచ్, బ్రాస్‌లెట్, కెమెరా మొదలైనవి.
5. ఏదైనా ఆభరణం/లోహ వస్తువులు.
6. ఏదైనా ఆహార పదార్థాలు తెరవబడిన లేదా ప్యాక్ చేయబడినవి, వాటర్ బాటిల్ మొదలైనవి.
7. మైక్రోచిప్, కెమెరా, బ్లూటూత్ పరికరం మొదలైన కమ్యూనికేషన్ పరికరాలను దాచడం ద్వారా అన్యాయమైన మార్గాల కోసం ఉపయోగించబడే ఏదైనా ఇతర వస్తువు.
8. ఒకవేళ ఎవరైనా అభ్యర్థి కేంద్రం లోపల నిషేధించబడిన ఏదైనా వస్తువును కలిగి ఉన్నట్లయితే, అది అన్యాయమైన మార్గాలను ఉపయోగించినట్లు పరిగణించబడుతుంది మరియు సంబంధిత నిబంధనలకు అనుగుణంగా అభ్యర్థిపై చర్య తీసుకోబడుతుంది.

పరీక్షా వేదిక / తరగతి గదిలో ఖచ్చితంగా నిషేధించబడింది

ఈ కార్యక్రమంలో adl spసురేందర్ రావు, డీఎస్పీ జీవన్ రెడ్డి, ఆయా కేంద్రాల సెంటర్ సుపెరెండెంట్ లు, కేంద్రీయ విద్యాలయ కో ఆర్డినేటర్ అశోక్, డిప్యూటి కో ఆర్డినేషన్ విశాఖ వాగ్మారే, MEO, తదితరులు ఉన్నారు.జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

## బాలికల భవిష్యత్ కి బలమైన బాట బాలశక్తి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ బాలికల భవిష్యత్ కోసం నిర్మల్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా బాలశక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ సంస్థలోరాష్ట్రంలోని 33 జిల్లాల విద్యాశాఖ అధికారులు, రీజినల్ డైరెక్టర్లకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమకార్యక్ర నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పాఠశాల, విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణ ఆహ్వానం మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బాలికల కోసం నిర్మల్ జిల్లాలోని 57 వసతిగృహ పాఠశాలలలో , 'బాలశక్తి' కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాలో విజయవంతంగా అమలవుతున్న బాలశక్తి కార్యక్రమంలోని నాలుగు కీలక అంశాలైన హెల్త్ అండ్ వెల్నెస్, ఫైనాన్షియల్ లిటరసీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఎక్స్పోజర్ విజిట్స్ పై విస్తృతంగా వివరించారు. బాలశక్తి కార్యక్రమంలో ఆరోగ్యం, వెల్నెస్, ఆర్థిక అవగాహన, నైపుణ్య అభివృద్ధి, సామాజిక సంస్థల సందర్శనలపై కేంద్రంగా పనిచేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, బాలికలకు పోషకాహారం, కళ్లద్దాలు, అవసరమైన వైద్యసాయం అందించినట్లు పేర్కొన్నారు. బాలికల్లో ఆర్థిక, సాంఘిక అవగాహన, క్రమశిక్షణ పెంచేందుకు జిల్లాలోని ప్రముఖ బ్యాంకులకు, ప్రభుత్వ రంగ సంస్థలకు, చారిత్రాత్మక ప్రదేశాలను విద్యార్థులు సందర్శించినట్లు తెలిపారు. కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి స్కిల్ కోర్సులు అమలు చేస్తున్నామని తెలిపారు. నిర్మల్ జిల్లాలోని 57 వసతిగృహ పాఠశాలల విద్యార్థులు చారిత్రాత్మక ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించడంతో వారికి విశేష అనుభవం లభించిందని కలెక్టర్ వివరించారు ఈ కార్యక్రమంలో ఎంసీఆర్ హెచ్ఆర్డీ డైరెక్టర్ రమేష్, జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనరసమ్మ, జిల్లాల విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భారత ప్రభుత్వం పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (DARPG), కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ, డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్ఆర్డీ), తెలంగాణ పంచాయతీరాజ్‌శాఖ భాగస్వామ్యంతో నిర్మల్‌లో రెండు రోజుల శిక్షణా కార్యక్రమం





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : భారత ప్రభుత్వం పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (DARPG), కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ, డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్ఆర్డీ), తెలంగాణ పంచాయతీరాజ్‌శాఖ భాగస్వామ్యంతో నిర్మల్‌లో రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ శిక్షణను నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని జెడ్పీ సీఈవో గోవిందు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామసభలు ప్రజల అభిప్రాయాలకు అద్దం పడే వేదికలని, ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం ద్వారా పాలనలో పారదర్శకత, బాధ్యతా భావం పెరుగుతుందని తెలిపారు. శిక్షణ ద్వారా పంచాయతీ కార్యదర్శులు తమ విధులను మరింత మెరుగుపరుచుకునే అవగాహన పొందుతారని ఆయన వివరించారు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామసభల ప్రాధాన్యం, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం ప్రజల భాగస్వామ్యంతో కూడిన పాలన, సమాచార హక్కు చట్ట అమలు, మహిళా సాధికారత, బాలల సంరక్షణ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మొదటి రోజు గురువారం కార్యక్రమంలో గ్రామ పంచాయతీ స్థాయిలో సమాచార హక్కు చట్టం-2005, పంచాయతీ కార్యదర్శుల బాధ్యతలు, మహిళా గ్రామసభలు, స్వయం సహాయక బృందాలతో సమన్వయం వంటి అంశాలపై నిపుణులు అధికారులకు అవగాహన కల్పించారు.


ఈ కార్యక్రమంలో ఎంసీఆర్‌హెచ్ఆర్డీ ఆదిలాబాద్ శిక్షణ కేంద్ర మేనేజర్ ఏ. రాజేశ్వర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, రిసోర్స్ పర్సన్స్ సాయిప్రసాద్, తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ పాలాభిషేకం



అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి దేశ భవిష్యత్తు అదృష్ట దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారు దేశ ప్రజల జన గణన మరియు కులగనను చేయాలని నిర్ణయించారు. దీనికి గాను దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గఎంపీ శ్రీ గోడం నగేష్ మాట్లాడుతూ దేశంలో జనగణన ఎంత ముఖ్యమైనదో అలానే కులగనన్నా కూడా అంతే ముఖ్యంగా భావించాలి మరియు ఏ వర్గానికి చెందిన వాళ్ళు తెలిసే విధంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తారని కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలియడం జరిగింది. దేశంలో అన్ని రాష్ట్రాలకు కూడా ఈ కులగణన అనేది ఉపయోగపడే విధంగా ప్రతి వర్గానికి అన్ని విధమైన పథకాలు అందే విధంగా ఈ కుల గణన ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ నిర్ణయం దేశంలో ప్రజలకు మంచి జరిగే విధంగా ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం కుల గణన విషయాన్ని తీసుకొచ్చింది. దీనికిగాను అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఎంపీ నగేష్ దేశ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం, పట్టణ అధ్యక్షులు వేదవ్యాస్, జోగు రవి, రవి రెడ్డి, భూమేష్, రాకేష్, సుభాష్, దయాకర్ బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి ఏరియా గనుల్లో 78 శాతం బొగ్గు ఉత్పత్తి




రెబ్బెన :అమృత్ తెలంగాణ: బెల్లంపల్లి ఏరియాలోని గనులు ఏప్రిల్ మాసంలో 78శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం మచ్చ గిరి నరేందర్ తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఏప్రిల్ మాసానికి సంబంధించిన బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. బెల్లంపల్లి ఏరియాలోని గనులు ఏప్రిల్ మాసంలో 3.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 78 శాతంతో 2.74 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిందని వివరించారు. కైరగూడ ఓసీపీ వద్ద జరుగుతున్న పనుల కారణంగా ఉత్పత్తి కొంతమేరకు తగ్గిందని, దానిని అధిగమించడానికి అందరి సహకారంతో కృషి చేస్తామని అన్నారు. గోలేటి ఓసీపీ ప్రారంభోత్సవం కోసం కసరత్తు కొనసాగుతుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ బెల్లంపల్లి ఏరియాకు నిర్దేశించిన వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు అందరి సహకారంతో అధిగమిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏరియా ఎస్ఓ టూ జీఎం రాజమల్లు ,డీజిఎం ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్ ఉన్నారు.

## కలెక్టర్ ను పుష్పగుచ్ఛం అందించి సత్కరించిన గొండ్వానా రాయి సెంటర్ చించుఘాట్ కమిటీ సభ్యులు








అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఆదిలాబాద్ : ఇటీవల ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రజాస్వామ్య సుపరిపాలన పురస్కారం అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషాను ఆదిలాబాద్ రూరల్ మండలం, గొండ్వానా రాయి సంటర్ చించుఘాట్ కమిటీ సభ్యులు శుక్రవారం నాడు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానం చేసి సత్కరించారు. జిల్లా ఖ్యాతి దేశమంతా వ్యాప్తి చెందేలా కృషిచేశారని కలెక్టర్ పనితీరును కొనియాడారు,చించుఘాట్ రాయి సెంటర్ గౌరవ అధ్యక్షులు కుమ్ర శ్యంరావు, సర్మేడి ఆత్రం పరుశురాం, రాయి సెంటర్ సార్ మేడితో పాటు ఖజానా దార్,మాడవి శ్యాంరావ్. గీతదార్ మార్సుకోలా,కేశవ్ రావ్.. సలహాదార్ మర్సుకొల సురేష్,తో పాటు ఆదివాసి నాయకులు జిల్లా నాయకులు పాలుగోన్నారు..

# ఇందిరమ్మ ఇండ్లలోనూ ఫెయిల్

మంచిర్యాల, మే 2.అమృత్ తెలంగాణ: : కాంగ్రెస్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా చెప్పుకుంటున్న ఆరు గ్యారెంటీల్లో ఒక్కటైన ఇందిరమ్మ ఇండ్ల పథకం ఫెయిల్ అయింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న వారికి లేదా ఇందిరమ్మ కమిటీలోని కాంగ్రెస్ పార్టీ నాయకులకు, డబ్బులు ఇచ్చినోళ్లే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా ఎంపిక అవుతున్నారు. ఈ రెండు ఉదాహరణలే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా రోజు ఇందిరమ్మ ఇండ్లకు అనర్హులు, కాంగ్రెస్ లీడర్లను ఎంపిక చేశారంటూ ప్రజలు తిరగబడుతున్నారు. గ్రామాల్లోకి సర్వేలు, సభలకు వెళ్లిన అధికారులను నిలదీస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ తరహా నిలదీతలు, నిరసనలు ఎక్కువైపోయాయి. బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంతోపాటు కాసిపేట మండలంలోని లంబాడీతండా(ధర్మారావుపేట్) గ్రామంలో సోమవారం గ్రామస్తులు అధికారులను నిలదీశారు. కాంగ్రెస్ నాయకులు, వారి బంధువులే ఎంపికైన లబ్ధిదారుల్లో ఉన్నారంటూ ఇందిరమ్మ ఇండ్ల సర్వేను అడ్డుకున్నారు. దీంతో చేసేది ఏం లేక అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. చెన్నూర్ నియోజకవర్గంలో సుద్దాల, కిష్టంపేట, ఎల్లక్కపేటతోపాటు ఎర్రగుంటపల్లి గ్రామస్తులు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ నాయకులు, వారి బంధువులనే ఎంపిక చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరిమెరి మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ గజానంద్, రాథోడ్ యశ్వంత్‌రావు అనే వికలాంగులు పోయిన వారం ఎంపీడీవో ఆఫీసు ఎదుట బైఠాయించారు. అన్ని రకాలుగా అర్హులుగా ఉన్న తమను ఎందుకు ఎంపిక చేయలేదంటూ నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బందిని వినతి పత్రం ఇచ్చి వెళ్లారు. బెజ్జూర్ మండలంలోని సారంగపల్లి, సలుగుపల్లి గ్రామస్తులు అనర్హులను ఎంపిక చేశారంటూ పంచాయతీ కార్యాలయం ఎదుట, రోడ్డుపై ధర్నా చేశారు. పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలు తాము ఉంటున్న గుడిసెలు, తాత్కాలిక ఇండ్లను చూపిస్తూ.. మమ్ములను ఎందుకు ఎంపిక చేయలేదంటూ నిలదీస్తున్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని
పేద యువకుడి ఆత్మహత్యాయత్నం

కోటపల్లి, : ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితా నుంచి కాంగ్రెస్ నాయకులు, అధికారులు తన పేరును తొలగించి అన్యాయం చేశారని మనస్తాపంతో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రొయ్యలపల్లికి చెందిన కుమ్మరి రవీందర్ బుధవారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా ఉన్నవారికి, ఆర్థికంగా ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించారని రవీందర్ ఆరోపించాడు. నిరుపేదలమైన తమకు అన్యాయం చేశారని వాపోయాడు.

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 34 వార్డులు ఉన్నాయి. ఇందులో 2,941 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇండ్లు ఉన్న కాంగ్రెస్ పార్టీ లీడర్లు వేరే దగ్గరున్న ఖాళీ స్థలాలు చూపిస్తూ ఇండ్లు లేని వారీగా దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుల జాబితాల్లో ఇండ్లు లేని పేదలకు బదులు ఇండ్లు ఉన్న కాంగ్రెస్ లీడర్లు, మాజీ ప్రజాప్రతినిధుల పేర్లు రావడం స్థానికంగా దుమారం రేపుతోంది.

ఓ వార్డుకు చెందిన మాజీ ప్రజాప్రతినిధి సహా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పీఏ గడ్డం దుర్గా ప్రసాద్ పేరు ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారుల జాబితాలో ఉండడంపై సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. జనం నుంచి విమర్శలు రావడంతో ఈ ఇద్దరూ జాబితాలో నుంచి తమ పేర్లను తొలగించాలంటూ బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. లబ్ధిదారుల జాబితాలో చాలా మంది కాంగ్రెస్ లీడర్ల పేర్లు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీ నాయకులకే ఇండ్లు ఇచ్చుకునేట్లు ఉంటే.. తమ నుంచి దరఖాస్తులు ఎందుకు తీసుకున్నట్లు అని మండిపడుతున్నారు.



చెన్నూర్ నియోజకవర్గంలోని సుద్దాల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ఆధ్వర్యంలో 42 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. దీనిపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో నిరుపేద కుటుంబాలు 300 మంది ఉంటే వారెవనికి కాకుండా ఇప్పటికే ఇండ్లు ఉన్న వారిని ఎంపిక చేశారంటూ గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శిని గ్రామసభలో నిలదీశారు. కిష్టంపేట గ్రామంలో 1100 దరఖాస్తులు రాగా, తమకు అనుకూలంగా ఉన్న 70 మందినే ఎంపిక చేశారు. ఎల్లక్కపేటలో 70 దరఖాస్తులు రాగా కేవలం నలుగురిని ఎంపిక చేశారు. దీనిపై ఎల్లక్కపేట కాలనీ వాసులు రోడ్డుపై ధర్నా చేశారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నోళ్లకు, డబ్బులు ఇచ్చినోళ్లకే ఇండ్లు ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పూరి గుడిసెలో ఉంటున్నా..

పూరి గుడిసెలో ఉండే నన్ను ఇందిరమ్మ ఇల్లుకు ఎంపిక చేయలేదు. ముందు ఇందిరమ్మ లిస్టులో పేరు వచ్చింది. ఇప్పుడేమో లిస్టులో నా పేరు తీసేశారు. అడిగితే నువ్వు అర్హుడివి కాదు అంటున్నారు. పూరి గుడిసెలో ఉంటూ కూలీ చేసుకుని బతికే నేను ఎందుకు అర్హుడిని కాదు. నాకు ఇండ్లు మంజూరు చేయకపోవడం దారుణం. ఇప్పటికే ఇల్లు ఉన్న వాళ్లకే ఇల్లు మంజూరు చేస్తున్నారు. పాత ఇందిరమ్మ ఇల్లు ఉన్న వాళ్లను కూడా మరోసారి ఎంపిక చేశారు. అర్హులైన నిరుపేదలైన మా వంటి పూరి గుడిసెల్లో ఉండే పేదలకు ఇండ్లు ఇవ్వాలి. సర్వే చేసి నిజమైన అర్హులను గుర్తించాలి– హట్కర్ రాజు, ధర్మారావుపేట, కాసిపేట

రేకుల షెడ్డులో ఉంటున్న ఇల్లు లేదు

మాది నిరుపేద కుటుంబం. రెక్కాడితే గానీ కడుపు నింపుకోలేను. కూలీ నాలీ చేసి సంపాదించిన కొద్ది పాటి సొమ్ముతో రేకుల షెడ్డు వేసుకున్నా. అలాంటి నన్ను ఇందిరమ్మ ఇంటి కోసం ఎంపిక చేయలేదు. గతంలో ఇల్లు ఇచ్చినోళ్లకే మరోసారి ఇల్లు ఇస్తున్నరు. ఇది ఎక్కడి న్యాయమో అర్థం అయితలేదు. మా ఊరిలో ఎవ్వరిని అడిగిన చెప్తరు. ఇందిరమ్మ ఇల్లును నేను పూర్తి అర్హురాలిని అని. కావాలంటే మరోసారి సర్వే చేసైనా సరే నన్ను ఎంపిక చేయాలి.– భూక్య సమత, ధర్మారావుపేట, కాసిపేట

నిరుపేదలం మాకు ఇయ్యలే..

మాది ఎర్రగుంటపల్లి గ్రామం. మాకంటూ సొంత ఇల్లు లేదు. ఊరిలో ఇల్లు ఉన్న వారినే ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేశారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నవాళ్లకు, వారి బంధువులకే ఇండ్లు రాస్తున్నారు. మాకు భూములు లేవు. మా తాతలు కట్టిన పాత ఇంట్లో ఉంటున్నాం. గోడలు కూలిపోడానికి సిద్ధంగా ఉన్నాయి. మాది నిరుపేద కుటుంబం. కష్టం చేసి బతికేటోళ్లం. ఉన్న రోజు కూలీ పనులకు పోతం. లేని రోజు పస్తులు ఉంటం. తప్పని సరి పరిస్థితి వస్తే అప్పులు చేసి అవసరం తీర్చుకుంటం. మేం ఇద్దరం ఆడపిల్లలమే. మా నాన్నకు మా పెళ్లిళు చేయడం కూడా పెద్ద భారమే. ఇల్లు సక్కగా లేదు. ఇందిరమ్మ ఇల్లు ఇస్తే కొంచెం అప్పు చేసైనా ఇల్లు కుట్టుకుంటం. ప్రభుత్వం మా వంటి పేదలకు ఇండ్లు ఇయ్యాలి.– సాగే సమ్మక్క, ఎర్రగుంటపల్లి, చెన్నూర్.

# ఆదిలాబాద్ జిల్లాలో షీ టీం బృందాల పనితీరు భేష్ : ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ :అమృత్ తెలంగాణ: మహిళల భద్రతకు షీ టీం బృందాలు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా షీ టీం బృందాలు యువతులకు, విద్యార్థిని విద్యార్థులకు, పని స్థలాల్లో మహిళలకు ప్రత్యేకంగా 21 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్య పరుస్తున్నామని వెల్లడించారు. ఏప్రిల్ నెలలో షీ టీం బృందాల ద్వారా నాలుగు ఎఫ్ఐఆర్ కేసులు, పది పెట్టీ కేసులు నమోదు చేశామని వివరించారు. షీ టీం బృందాలు నెల రోజులలో 110 గ్రామాలు సందర్శించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించిందని అన్నారు. వివిధ ప్రదేశాలలో ఉండి మహిళలను వేధిస్తున్న వారిని ఆదిలాబాద్‌కు రప్పించి కేసులను నమోదు చేయడంలో ఆదిలాబాద్ షీ టీం బృందాలు చురుకుగా




పనిచేస్తున్నాయని ప్రశంసించారు. ఆపత్కాల సమయంలో షీ టీం బృందాల ను సంప్రదించాలంటే 87126 59953 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 42 హాట్‌స్పాట్‌లను గుర్తించి వాటిని ప్రతి వారం ఆకస్మికంగా తనిఖీ చేస్తూ పర్యవేక్షిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమాలలో చైల్డ్ మ్యారేజ్, గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్‌లపై, సైబర్ నేరాలు, సోషల్ మీడియాలలో జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పిస్తూ యువతను చైతన్య పరుస్తున్నామని వివరించారు.

# మమత హాస్పిటల్ ను సీజ్ చేయాలి.

కోల్ సిటీ, మే 2:అమృత్ తెలంగాణ: నిబంధనలకు విరుద్ధంగా గర్భిణులకు లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్న ఫిర్యాదుతో ఇటీవల దవాఖానను తనిఖీ చేసేందుకు వచ్చిన దళిత జిల్లా వైద్యాధికారి అన్న ప్రసన్న కుమారి విధులకు ఆటంకం కలిగించడంతోపాటు చంపుతామని బెదిరించిన హాస్పిటల్ నిర్వాహకులు, మాజీ మేయర్ అనిల్ కుమార్, మాజీ కార్పొరేటర్ మహంకాళి స్వామిని వెంటనే అరెస్టు చేయాలని, అనుమతి లేకుండా స్కానింగ్ పరీక్షలు చేస్తున్న మమత హాస్పిటల్ ను వెంటనే సీజ్ చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు శుక్రవారం డీఎంహెచ్ఓ ను కలిసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలతో ప్రైవేట్ హాస్పిటల్ తనిఖీ చేయడానికి వచ్చిన జిల్లా వైద్యాధికారిణి పై



తిరగబడడంతోపాటు ఆమె పైన కేసు నమోదు చేయించడం సరైంది కాదని పేర్కొన్నారు. డీఎంహెచ్వో విధులకు ఆటంకం కలిగించి చంపుతామని బెదిరించిన ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యులు, మాజీ ప్రజాప్రతినిధులపై అట్రాసిటీ కేసు కింద నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే డీఎంహెచ్ఓపై నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రజల్లో రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, డాక్టర్లపై నమ్మకం పోయేలా ప్రవర్తించిన ఈ సంఘటనను తాము తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ ను కలిసి ప్రభుత్వ అధికారిని పట్ల బెదిరింపులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసేలా ఆదేశించాలని కోరారు. అలాగే ఈ సంఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా మంత్రి శ్రీధర్ బాబును కూడా కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సంకనపల్లి లక్ష్మయ్య, సందీప్, నారాయణ, కన్నూరి బాపు, సంతోష్, కనుకుంట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సన్నపల్లిలో అప్పు డబ్బులు అడిగినందుకు మహిళ హత్య

కామారెడ్డి :అమృత్ తెలంగాణ: అప్పు ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని అడినందుకు ఓ మహిళను హత్య చేసినట్లు కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం చింతామణిపల్లి గ్రామానికి చెందిన జంగంపల్లి మహేష్‌పై గతంలో బిక్కనూరు పోలీసు స్టేషన్‌లో మర్డర్ కేసు నమోదైంది. కాగా ఆ కేసుకు సంబంధించి బెయిల్ కోసం కామారెడ్డి మండలంలోని నర్సన్నపల్లికి చెందిన చిదుర కవిత వద్ద రూ.ఒక లక్ష అప్పుగా తీసుకున్నాడు. అయితే ఆ డబ్బులను తిరిగి ఇవ్వాలని కవిత మహేష్‌ను అడగగా డబ్బులను ఇస్తానని, వ్యవసాయ బావి వద్దకు రావాలని సూచిస్తాడు. అక్కడకు రాగానే ఆమెను పథకం ప్రకారం.. కవితపై దాడి చేసి ఆమె చీర కొంగుతో ఉరి వేసి హత్య చేశాడు. వెంటనే ఆమె పై ఉన్న బంగారు కమ్మలు, మాటీలు, ఉంగరం, ఆమె మొబైల్ ఫోన్ దొంగిలించి ఎవరికి అనుమానం రాకుండా అక్కడి నుండి పారిపోయాడు. కాగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా మహేష్‌పై అనుమానం రాగా విచారణ చేపట్టడం జరిగింది. కాగా నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. నిందుతుడి వద్ద నుండి కమ్మలు,




మాటీలు, ఉంగరం, మొబైల్ ఫోన్ స్వాదీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. ఈ కేసును 48 గంటలలోపు ఛేధించిన కామారెడ్డి రూరల్ సీఐ ఎస్ రామన్, దేవునిపల్లి ఎస్సై జీ రాజు, క్రైమ్ టీం సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# కూతురి జన్మదిన కానుకగా మరణానంతరం అవయవ దానానికి తల్లిదండ్రుల అంగీకారం

కోల్ సిటీ , మే 2:అమృత్ తెలంగాణ: కూతురు పుట్టిన రోజున తల్లిదండ్రులు బహుమానంగా ఖరీదైన వస్తువో లేక మంచి బట్టలు కొనివ్వడం లేదా ఏదైనా షాపింగ్ తీసుకెళ్లడం సాధారణంగా చూస్తుంటాం. కానీ గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన సింగరేణి కాంట్రాక్టర్ కట్ల లక్ష్మీనారాయణ, అతని భార్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలు స్వరూపలు శుక్రవారం తమ కుమార్తె శ్రీమేధ పుట్టిన రోజున సమాజం గర్వించే నిర్ణయం తీసుకున్నారు. తమ మరణానంతరం నేత్ర, అవయవదానం చేయాలని అంగీకారం తెలిపారు. వారి స్వగృహంలో జరిగిన పుట్టిన రోజు వేడుకలకు గోదావరిఖని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పందిళ్ల శ్యాంసుందర్, సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ప్రచార



కార్యదర్శి వాసులు హాజరై ఆ దంపతులకు అంగీకార పత్రాలను అందజేసి అభినందించారు. ఆ దంపతులు తీసుకున్న నిర్ణయం ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయమన్నారు. మరణానంతరం నేత్రాలు, అవయవాలు దానం చేయడం వల్ల మరొకరికి పునర్జన్మ ప్రసాదించడం వల్ల మానవ జన్మకు సార్థకం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సదాశయ సభ్యులు రాములు, సరోజన, మగువ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు శశికళ, సదాశయ సభ్యులు నాగుల శంకర్, సుదర్శన్, దబ్బెట శంకర్, కుటుంబ సభ్యులు సమ్మక్క, చంద్రశేఖర్, స్రవంతి, సాహితీ, ప్రవీణ్. ఆరుణ్ కుమార్ పాల్గొన్నారు.

# న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.. కుంచ సునీల్ గౌడ్

కోరుట్ల, మే 2: అమృత్ తెలంగాణ: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కుంచ సునీల్ గౌడ్ అన్నారు. పట్టణంలోని కోరుట్ల బార్ అసోసియేషన్ సభ్యులను ఆయన శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల అసోసియోషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన బైరి విజయ్ కుమార్‌తోపాటు నూతన కార్యవర్గానికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల హక్కుల రక్షణ కోసం ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావడం కోసం కృషి చేస్తానని తెలిపారు. న్యాయవాదుల సంక్షేమానికి బార్ కౌన్సిల్ అమలు చేస్తున్న వివిధ పథకాలను ఆయన వివరించారు. అనంతరం బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడికి అసోసియేషన్ తరుపున జ్ఞాపికను, బీఆర్ అంబెద్కర్ చిత్ర పటాన్ని అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు కస్తూరి రమేష్, జాయింట్ సెక్రటరీ చిలివేరి రాజశేఖర్, కోశాధికారి చింతకింది ప్రేమ్, సీనియర్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ గోనే సదానంద్ నేత, లేడీ రిప్రజెంటేటీవ్ అంబల్ల నాగ నిర్మల, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీలు ఫసియుద్దిన్, సుతారి నవీన్, జూనియర్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ రాసభక్తుల రాజశేఖర్, సీనియర్,



జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# సుందరగిరిలో అర్హులకు ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆందోళన




చిగురుమామిడి, మే 2:అమృత్ తెలంగాణ: ఇల్లిస్తామంటే ఆశగా దరఖాస్తు చేసుకున్నామని, తామంతా అర్హులమని, తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని బాధితులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన మండలంలోని సుందరగిరి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తామంతా కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉన్నామని, తాము అర్హులమైన ఇల్లు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా కిరాయి ఇండ్లలో కిరాయికి ఉంటున్నామని వాపోయారు. ఈ విషయంపై తహసీల్దార్ ముద్దసాని రమేష్, ఎంపీడీవో మధుసూదన్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు స్పందించడం లేదని బాధితులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎనగందుల తేజశ్రీ, ఎనగందుల రాజేశ్వరి, జేరిపోతుల శ్రీనివాస్, వంతడుపుల శ్రీనివాస్, ఎనగందుల తిరుపతి, ఎనగందుల సారవ్వ, ఎనగందుల మహేందర్, పంతడుపుల రజిత, కిన్నెర పూజలత, జేరిపోతుల సంజీవ్ పాల్గొన్నారు.

# చౌటుప్పల్, నారాయణపూర్ మండలాలకు కృష్ణా జలాలు : ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, మే 02 :అమృత్ తెలంగాణ: చౌటుప్పల్, నారాయణపూర్ మండలాలకు కృష్ణా జలాలు అందించడానికి అనుసరించాల్సిన ప్రణాళికలపై శుక్రవారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మునుగోడు నియోజకవర్గంలోని లక్ష్మాపురం, శివన్నగూడెం రిజర్వాయర్లకు కొనసాగింపుగా నారాయణపూర్, చౌటుప్పల్ మండలాలకు నీరందించడానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై రిటైర్డ్ ఇంజినీర్స్ ఫోరం సభ్యులు, ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. చౌటుప్పల్ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతున్నందున భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జనాభాకు సరిపడా తాగునీరు అందించడంతో పాటు, నారాయణపూర్, చౌటుప్పల్ మండలాల్లోని చెరువులు, కుంటలను నింపి భూగర్భ జలాలను రీఛార్జి చేసే విధంగా శివన్నగూడెం రిజర్వాయర్ నుండి నీటిని తీసుకొచ్చేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ రెండు మండలాలకు నీటిని తీసుకొచ్చే విషయంలో తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ ఫోరం సభ్యుల సలహాలు,



సూచనలు తీసుకున్నారు.

# ఉల్లాసంగా - ఉత్సాహంగా ప్రారంభమైన తాళ్లరేవు చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంప్ 2025

తాళ్లరేవు: అమృత్ తెలంగాణ: :తాళ్లరేవు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ 2025 శుక్రవారం ఉల్లాసంగా, ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా సమ్మర్ క్యాంపులో విజ్ఞానం, వినోదం, వికాసం పేరుతో నిర్వహించిన పలు కార్యక్రమాలను ఎంపీపీ రాయుడు సునీత గంగాధర్, జడ్పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, ముమ్మిడివరం ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ లు బెలూన్స్ ను గాలిలోకి వదలగా విద్యార్థులు ఆ బుడగలను బ్లాస్ట్ చేయడం ద్వారా సమ్మర్ క్యాంపు చిన్నారుల కేరింతల తో ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధి గుత్తుల మల్లేశ్వరరావు పది రోజులు పాటు ప్రజా సంఘాల భవనం, విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో జరగబోయే కార్యక్రమాలను వివరించారు. చిన్నారులకు ఏజ్ గ్రూప్ ఆధారంగా డ్రాయింగ్, క్రాఫ్ట్ శిక్షణ, వ్యాసరచన, జీ. కె. అండ్ క్విజ్ పోటీలు, డాన్స్, పాటలు, ఆటల పోటీలు, స్పోకెన్ ఇంగ్లీష్, నీతి కథలు, వ్యక్తిత్వ వికాసం తో పాటు ఈ ఏడాది ప్రత్యేకంగా మ్యాజిక్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. నిపుణులైన ఉపాధ్యాయులచే ఈ సమ్మర్ క్యాంప్ ఈనెల 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు లో భాగంగా దేశభక్తి గీతాలను చిన్నారులకు నేర్పించారు. చిన్నారులచే కోలాటం, జానపదం వంటి నృత్యాలు ప్రదర్శించారు. అడ్వకేట్ ఝాన్సీ ఫోక్సో చట్టం గురించి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ప్రశ్నలకు ఉత్తమ సమాధానాలు చెప్పిన వారికి బహుమతులు అందించారు. అనంతరం క్రాఫ్ట్ లో భాగంగా చిన్నారులకు ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, చిట్టితల్లి రంగుల పేపర్లతో బొమ్మల తయారీ నేర్పించారు. కాశి రవీంద్ర మాస్టారు జనరల్ నాలెడ్జ్ (జీ. కె.) కు సంబంధించి కరెంట్ అఫైర్స్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లరేవు లయన్స్ క్లబ్ ప్రతినిధి బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గంజా సూరిబాబు, బీమాబాయి మహిళా మండలి డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన, పల్లె సిరి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మురళీధర్, యుటిఎఫ్ మండల అధ్యక్షులు తాతారావు, పంతగడ సూర్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, ఎండియూడబ్ల్యూఏ అధ్యక్షులు కన్నీడి వెంకటరమణ, హిందీ ఉపాధ్యాయులు తణుకు రాంబాబు, చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధులు ఈశ్వరి బాయి, నాని, శ్రీనివాస్, కృష్ణ, ఆనంద్, ప్రజా సంఘాల నాయకులు ఈశ్వరరావు , రాజబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఉత్తమ నాటకంగా ఎంపికైన "ఇది అతని సంతకం"







భట్టిప్రోలు అమృత్ తెలంగాణ: మండలంలోని పల్లెకోన గ్రామంలో పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరుచూరి రఘుబాబు స్మారక 35వ జాతీయ(2025) నాటకోత్సవాలు ఏప్రిల్ నెల 27వ తేదీ నుండి మే 1వ తేదీ వరకు నిర్వహించారు. ఇందులో నాటక విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా "ఇది అతని సంతకం" నాటకం ప్రథమ బహుమతినిసాధించింది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా "అన్నదాత"ఉత్తమ దర్శకత్వం ఇది అతని సంతకం నాటకానికి లభించింది. ఉత్తమరచన,ఉత్తమ నటుడు ఇది అతని సంతకం నాటకానికి లభించగా ఉత్తమ నటి 27వ మైలురాయి లో నటించిన వైదేహి పాత్రధారి సురభి ప్రభావతికి లభించింది. ఉత్తమ ప్రతినాయకుడిగా అన్నదాత నాటకంలో మేస్త్రి పాత్రధారి కొల్లా రాధాకృష్ణ దక్కించుకున్నారు. ఉత్తమ క్యారెక్టర్ యాక్టర్ గా అన్నదాత నాటకంలోని రాఘవయ్య పాత్రధారి భుజంగరావును వరించింది. ఉత్తమ సహాయానటుని 27వ మైలురాయిలో నటించిన పవన్ కుమార్ కు లభించింది. ఉత్తమ హాస్యానటునిగ అన్నదాత లో బుచ్చియ్య పాత్ర దారి తిరుమలకు లబించిది. ఉత్తమ ఆహార్యం హరిలో రంగ హరి లోని సురభి రాఘవకు దక్కింది. ఉత్తమ సంగీతం ఇది అతని సంతకం లోని లీలా మోహన్ కు, ఉత్తమ రంగాలంకరణ కు హరిలోరంగ హరి నాటకానికి,ప్రత్యేక బహుమతి మంత్ర నగరి లోని నవీన్ పాత్రధారి అనిల్ కుమార్ కు,మరో ప్రత్యేక బహుమతి 27వ మైలురాయిలోని సూరిగాడు పాత్రధారి ఆర్ వాసు కు లభించాయి.


నాటికలువిభాగంలో : ఉత్తమ నాటికగ మహాప్రస్థానం,ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా జనరల్ బోగీలు,ఉత్తమ దర్శకత్వం మహాప్రస్థానం,ఉత్తమ రచన జనరల్ బోగీలు, ఉత్తమ నటుడు జనరల్ బోగీలోని గోకరాజు విజయ్, ఉత్తమ నటి జనరల్ బోగీలోని సురభి ప్రభావతి,ఉత్తమ ప్రతినాయకుడిగా చిగురు మేఘంలోని కే సరిత,ఉత్తమ సహాయ నటి చిరుమేఘంలోని నరసమ్మ పాత్రధారి బి నాగరాణి,ఉత్తమ సహాయ నటుడిగా మహాప్రస్థానంలోని సింహాద్రి పాత్రధారి బి నరేష్,ఉత్తమ హాస్యనటుడిగా విడాకులు కావాలి నాటికలోని గంగోత్రి సాయి,ఉత్తమ ఆహార్యం ద్వారా బంధాల చంద్రయ్య నాయుడులోని పీవీ సత్యనారాయణ, ఉత్తమ సంగీతం మహాప్రస్థానంలోని నాగరాజుకు,ఉత్తమ రంగాలంకరణ పి దీపక్ ప్రత్యేక బహుమతి ద్వారా బంధాల చంద్రయ్య నాయుడు కృష్ణ హితేష్ కు దక్కాయి. ప్రత్యేక బహుమతి హక్కు నాటికలో ని సతీష్ కు మరో ప్రత్యేక బహుమతి విడాకులు కావాలి లోని జి వసంత యామినికి లభించాయి. విజేతలకు వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనంద బాబు,పరుచూరి వెంకటేశ్వరరావు,సినీనట ి పిశివపార్వతి, తదితరులునటీ,నటులకు బహుమతులు అందించారు.

# వైసీపీ ప్రభుత్వ హయంలో జరిగిన ప్రమాదాలు కూడా రాజకీయ హత్యలేనా ? : గంటా

ఎంవిపి కాలనీ (విశాఖ) అమృత్ తెలంగాణ: చందనోత్సవంలో సింహాచలం కొండపై గోడ కూలిన సంఘటనలో మరణాలు రాజకీయ హత్యలైతే.. వైసీపీ హయంలో జరిగిన ప్రమాదాల్లో చోటు చేసుకున్న మరణాలు కూడా రాజకీయ హత్యలేనా అని గంటా ప్రశ్నించారు శుక్రవారం ఉదయం ఎంవిపి కాలనీలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఫార్మా కంపెనీలు ఇచ్చే నష్ట పరిహారంతో చందనోత్సవం గోడ కూలిన ఘటన పరిహారాన్ని పోల్చడం సరికాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎసెన్షియా ఫార్మా, సినర్జీ యాక్టీవ్ కంపెనీ ప్రమాదాల్లో మతులకు రూ. కోటి చొప్పున పరిహారాన్ని అందించాం. వైసీపీ అధికారంలో ఉండగా ఆక్సిజన్ అందక రుయా ఆస్పత్రిలో 11 మందికి.. దేవీపట్నం బోట్ ప్రమాదంలో 12 మందికి.. అన్నమయ్య ఆనకట్ట గేట్లు కూలి 39 మందికి రూ.10 లక్షల చొప్పున మాత్రమే వైసీపీ ప్రభుత్వం పరిహారాన్ని అందించిన విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తు చేసుకోవాలి. బాధ్యత గల రాజకీయ పార్టీగా వైసీపీ నాయకులు నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాల్సి ఉండగా.. సున్నితమైన చందనోత్సవం దుర్ఘటనను కూడా రాజకీయ లబ్ధికి వాడుకోవడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శమన్నారు . రూ. 25 లక్షల పరిహారం తీసుకున్న మృతుల కుటుంబీకులకు వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.75 లక్షల బ్యాలెన్స్ ఇస్తామని బాధితులను బాధ పెట్టేలా జగన్మోహన్ రెడ్డి మాట్లాడడం సరికాదని మొన్నటి ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకు పరిమితమై ఘోర ప్రభావాన్ని మూటగట్టుకున్న వైసీపీ త్వరలో అంతర్ధానమైపోయే పార్టీ. జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారని పగటి కలలు కంటున్నారు. సింహాచలం కొండపై గోడ కూలిన ప్రాంతం గ్రామ బలిహరణం ఆవల ఉన్నప్పటికీ.. యాత్రికుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని వైదిక సంప్రదాయం ప్రకారం అవసరమైన అన్ని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శాంతి హోమం కూడా చేయనున్నారు. సంప్రోక్షణ చేయలేదు, శుద్ధి చేయలేదు, అని వైసీపీ నాయకులు ప్రకటనలు చేసి భక్తులను అయోమయానికి గురి చేయవద్దు. దేవాలయాల పట్ల.. హిందూ సంప్రదాయాల పట్ల జగన్మోహన్ రెడ్డి తీరు రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. ప్రసాద స్వీకరణ.. అక్షింతల విషయంలో ఆయన వైఖరిని అందరూ చూశారు.



# సుహానా సో క్యూట్ అనిపిస్తోందిగా!



సుహానా ఖాన్ సోషల్ మీడియా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు నెట్టింట మహా యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలతో కుర్రాళ్లలో కాకలు పుట్టిస్తుంది. ఎలాంటి పోటోలు నెట్టింట వైరల్ అవుతాయో సుహానాకి బాగా తెలుసని ఎన్నోసార్లు రుజువు చేసింది. హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వకముందే అంతకు మించిన ఫాలోయింగ్ ని సంపాదించుకుంది. కురచ దుస్తులే కాదు..సమయం వస్తే చీర కట్టి మరీ ఆకర్షించుకుంటానని మరోసారి అమ్మడు నిరూపించింది. ఇదిగో ఇక్కడ అందమైన చీరకట్టుకుని క్యామ్ కి ఇచ్చిన ఫోజులిప్పుడు నెట్టింట వైరల్ గా మారాయి. ఇందులో సుహానా క్రీమ్ కలర్ పలుచని సారీ..మ్యాచింగ్ షోల్డర్ లెస్ బ్లౌజు ధరించింది. చెవులకు గ్రీన్ కలర్ దిద్దులు.. అందమైన హెయిర్ స్టైల్ లో సుహానా మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. సారీ ధరించినా సుహానా ఇంకా 20 ఏళ్ల అమ్మాయిలాగే కనిపిస్తుంది. పాల నురుగుల సౌందర్యం...సన్నని ఆ శరీర రూపం అన్ని సుహానాని మరింత అందంగా ప్రొజెక్ట్ చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. సుహానాని ఇలా చూసి కొన్ని హృదయాలు తట్టుకోలేకపోతున్నాయి. సుహానా సో క్యూట్ అంటూ కామెంట్లు పెట్టిస్తున్నాయి. లుక్స్ గార్జియస్...బ్యూటీఫుల్..అంటూ అభిమానులు తమ మనసులో భావాల్ని బయటకు తీస్తున్నారు. ఇక బాద్ షా వారసురాలు ది అర్జీస్ తో సుహానా ఖాన్ బాలీవుడ్లో తెరంగేట్రం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇదే సినిమాతో చాలా మంది వారసులు ఎంట్రీ ఇస్తున్నారు. వాళ్లతో పాటు సుహానాని షారుక్ లాంచ్ చేస్తున్నారు. మరి అమ్మడి స్క్రీన్ ప్రజెన్స్ ఎలా ఉంటుందన్నిది చూడాలి. షారుక్ వారసత్వాన్ని కొనసాగించాల్సిన బాధ్యత కూడా సుహానా ఖాన్ పైనే ఉంది. తనయుడు ఆర్యన్ ఖాన్ దర్శకుడిగా రాణించాలని చూస్తున్నాడు. ఇప్పటికే ఆరకమైన ప్రయత్నాలు మొదలు పెట్టాడు.

# మరోసారి గొప్ప మనస్సును చాటుకున్న సూపర్ స్టార్..!

టాలీవుడ్ లోని టాప్ స్టార్స్ లో సూపర్ స్టార్ మహేష్ బాబు ఒకరు. నెంబర్ వన్ రేసులో మహేష్ బాబు ఎప్పుడో చేరిపోయాడు. గత కొన్నేళ్లుగా మహేష్ బాబు వరుస హిట్లతో దూసుకెళుతూ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతున్నాడు. 'భరత్ అనే నేను'.. 'మహర్షి'.. 'సరిలేరు నీకెవ్వరు' సినిమాలతో మహేష్ బాబు హ్యాట్రిక్ విజయాలను సొంతం చేసుకున్నాడు. ఈ ఏడాది 'సర్కారు వారి పాట'తో మరో సాలీడ్ హిట్ అందుకున్నాడు. ఈ సినిమాలో మహేష్ బాబును దర్శకుడు పర్శురాం సరికొత్త లుక్కులో చూపించారు. రోజురోజుకీ మహేష్ బాబు అందం పెరగడమే గానీ తగ్గదు అన్నట్లుగా ఈ మూవీలో ఆయన కన్పించారు. మహేష్ కు జోడీగా 'మహానటి' కీర్తి సురేష్ నటించింది. వీరిద్దరి కాంబినేషన్లో తొలిసారి వచ్చిన సినిమానే బాక్సాఫీస్ ను షేక్ చేసింది. దీంతో అటూ కీర్తి ఫ్యాన్స్.. ఇటూ మహేష్ ఫ్యాన్స్ సంబరాల్లో మునిగిపోయారు. ఈ మూవీ తర్వాత దర్శకుడు త్రివిక్రమ్ తో కలిసి 'ఎస్ఎస్ఎంబీ28' సినిమాను చేస్తున్నాడు. ఈ సినిమాను 2023 ఏప్రిల్ 28న విడుదల చేయనున్నట్లు మూవీ మేకర్స్ ప్రకటించారు. ఇకపోతే మహేష్ బాబు తన సంపాదనలో కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ఇప్పటికే అనేక మంది చిన్నారులకు మహేష్ బాబు ఫౌండేషన్ ద్వారా ఆపరేషన్లు చేయించి వారందరికీ కొత్త జీవితాన్ని ప్రసాదించారు. దీంతోపాటు తాను గతంలో దత్తత తీసుకున్న బుర్రిపాలెం గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించారు. తాజాగా మరోసారి మహేష్ బాబు తన గొప్ప మనస్సును చాటుకున్నారు. బుర్రిపాలెం గ్రామంలోని సర్కారు బడిలో డిజిటల్ లెర్నింగ్ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మహేష్ బాబు ఫౌండేషన్ సహాయం అందించింది. ఈ విషయాన్ని బుర్రిపాలెం పాఠశాలకు చెందిన ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు సోషల్ మీడియా ద్వారా పంచుకొని మహేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సోషల్ మీడియా ద్వారా ఈ న్యూస్ తెలుసుకున్న అభిమానులు తమ హీరో చేసిన పనికి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెటిజన్లు సైతం మహేష్ బాబు నిజంగా సూపరహే అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. దీంతో ఈ ట్వీట్ కాస్త నెట్టింట్లో వైరల్ గా మారింది.



# బేబీ నెక్స్ట్ స్టెప్ ఏంటి..?

షార్ట్ ఫిలిమ్స్ తో మెప్పించిన వైష్ణవి చైతన్య ఆ తర్వాత సినిమాల్లో సైడ్ రోల్స్ చేస్తూ వచ్చింది. బేబీ సినిమాతో అమ్మడు లీడ్ రోల్ ఛాన్స్ అందుకోగా అది కాస్త సూపర్ హిట్ అయ్యింది. బేబీ హిట్ పడటంతో వైష్ణవికి వరుస ఛాన్స్ లు వచ్చాయి. ఆశీష్ తో లవ్ మీ సినిమా చేసిన అమ్మడు ఆ సినిమా ఫెయిల్ అవ్వడంతో కాస్త కంగారు పడింది. ఐతే సిద్ధుతో జాక్ సినిమా ఒడ్డున పడేస్తుందని భావించగా అది కూడా తుస్సుమన్నది. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ డైరెక్షన్ లో తెరకెక్కిన జాక్ సినిమా ఎలా వచ్చిందో అలానే వెళ్లింది. ఈ సినిమాలో హీరోయిన్ గా చేసిన వైష్ణవి చైతన్య మరో ఫెయిల్యూర్ సినిమా తన ఖాతాలో వేసుకుంది. లవ్ మీ సినిమా పోయినా జాక్ తనను కాపాడుతుందని భావించిన వైష్ణవి చైతన్యకు పెద్ద షాక్ తగిలినట్టు అయ్యింది. వరుసగా రెండు సినిమాలు నిరాశ పరిస్తే ఎంత పెద్ద స్టార్ హీరోయిన్ కైనా ఛాన్స్ లు రావడం కష్టం అలాంటిది వైష్ణవి చైతన్యకు ఇక మీదట అవకాశాలు వస్తాయా లేదా అన్నది చూడాలి. ముఖ్యంగా అమ్మడు ఎలాంటి సినిమా పడితే అలాంటి సినిమా అన్నట్టు కాకుండా పాత్ర ప్రాధాన్యత ఉన్న సినిమాలు చేస్తే బెటర్ అని ఆడియన్స్ భావిస్తున్నారు.








యషికా ఆనంద్ హాట్ ఇన్ ఎల్లో